36 మంది నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భీకర ఎన్‌కౌంటర్
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- మృతులు పీఎల్‌జీఏ 5, 6 కంపెనీ సభ్యులు?
- ఈ ఏడాది ఎదురు కాల్పుల్లో ఇప్పటి వరకు185 మంది మావోయిస్టుల మృతి

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 4: పచ్చటి ప్రకృతిలో తుపాకులు గర్జించాయి. నట్టడివిలో నెత్తుటేర్లు ప్రవహించాయి. ఆయువుపట్టులాంటి దండకారణ్యంలో మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య శుక్రవారం భీకర పోరాటం జరిగింది. పోలీసుల తూటాలకు పెద్ద ఎత్తున సాయుధ నక్సలైట్లు ప్రాణాలు విడిచారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెండూర్ – తులతులీ గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారన్న పక్కా సమాచారంతో దంతేవాడ, నారాయణపూర్ జిల్లాల పోలీసులు, డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు గురువారం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలు – మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఇరువైపులా సుమారు ఏడు సార్లు కాల్పులు జరిగినట్లు సమాచారం. మూడు గంటల భీకర పోరు తరువాత జవాన్ల తాకిడిని తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారు. కాల్పులు ముగిసిన అనంతరం ఘటనా స్థలాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టగా, 36 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మావోయిస్టులకు చెందిన అధునాతన ఆయుధాలు, ఇతర సామగ్రిని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన దంతేవాడ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మావోలకు భారీ ఎదురుదెబ్బ

ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టులు పీఎల్‌జీఏ 5, 6 కంపెనీలకు చెందిన సభ్యులుగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. 150 మందికి పైగానే సాయుధ మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నట్టు తెలుస్తున్నది. 36 మంది మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు చెబుతున్నప్పటికీ 40 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. అయితే, ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేతలు ఎవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. వరుస ఎన్‌కౌంటర్లతో నష్టపోతున్న మావోయిస్టులకు తాజా ఘటన పెద్ద ఎదురుదెబ్బ. ఈ కాల్పుల్లో ఒక కంపెనీ మొత్తాన్ని భద్రతా దళాలు తుడిచిపెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ అదే జరిగితే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. మరి కొందరు మావోయిస్టులు బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నారని, పలువురు మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తున్నది. ఈ ఘటన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు సరిహద్దుల్లో రెడ్ అలర్ట్ ప్రకటించాయి.

ఈ ఏడాదిలోనే 185 మంది మావోల మృతి

మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ 'కగార్' వేగంగా కొనసాగుతున్నది. ఈ క్రమంలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు ఏకపక్షంగా పైచేయి సాధిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్‌లలో 185 మందికి పైగానే మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మహిళా మావోయిస్టుల సంఖ్య కూడా 40కి పైనే ఉంది. తాజా ఎన్‌కౌంటర్‌లో ఎంత మంది మహిళా మావోయిస్టులు ఉన్నారనేది తెలియాల్సి ఉంది.

తుది శ్వాసతో నక్సలిజం: సీఎం విష్ణుదేవ్

ఈ ఎన్‌కౌంటర్ భారీ ఆపరేషన్ అని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ పేర్కొన్నారు. నక్సలిజం తుదిశ్వాస తీసుకుంటున్నదని, రాష్ట్రం నుంచి నక్సలిజాన్ని పారదోలతామని పేర్కొన్నారు. ఇందుకోసమే కేంద్ర హోంమంత్రి అమిత్ షా గత తొమ్మిది నెలల్లో రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించారని, 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

సరిహద్దుల్లో వేగంగా చైనా నిర్మాణాలు

ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి, ముఖ్యంగా లడఖ్ సెక్టార్‌లో చైనా శరవేగంగా మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నదని భారత వైమానిక దళ అధిపతి ఏపీ సింగ్ శుక్రవారం తెలిపారు. భారత్ సైతం అదే స్థాయిలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నదని వెల్లడించారు. విదేశీ గడ్డపై మన శత్రువులను నిర్మూలించే సామర్థ్యం మనకుందని బాలాకోట్ వైమానిక దాడుల్లో చూపించామన్నారు. భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది ఇటీవల మాట్లాడుతూ ఎల్‌ఎసీ వద్ద పరిస్థితి స్థిరంగానే ఉన్నా సాధారణంగా లేదని తెలిపారు. ఈ విషయమై ఇరు దేశాల మధ్య కమాండర్ల స్థాయిలో జరుగుతున్న చర్చలు సానుకూల సంకేతాలు ఇస్తున్నాయని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు సమీక్షకు సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ: షెడ్యూల్డు కులాలకు కల్పించిన రిజర్వేషన్లను వాటిలోని ఉప కులాలను వర్గీకరించి కేటాయించే అధికారం రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు ఉందని గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పులో పొరపాటు లేదని చెప్పింది. ఈ తీర్పును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చింది. దీనిని పునః సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను అదే ధర్మాసనం పరిశీలించి, డిస్మిస్ చేసింది. వీటిని ఓపెన్ కోర్టులో లిస్ట్ చేయాలన్న విజ్ఞప్తిని కూడా తిరస్కరించింది. ఈ కేసులో మెజారిటీ తీర్పుతో ఏకీభవించకుండా ప్రత్యేక అభిప్రాయాన్ని తెలిపిన జస్టిస్ బేలా ఎం త్రివేది కూడా ఈ పిటిషన్లను పరిశీలించి, డిస్మిస్ చేశారు.

కార్యకర్తల చేతులపై నడిచిన బీజేపీ నేత

కురుక్షేత్ర: కొందరు కార్యకర్తలు తమ అర చేతులను నేలపై ఉంచగా వారిని ఆశీర్వదిస్తూ బీజేపీ నేత ఒకరు వారి చేతులపై నడుచుకుంటూ వెళ్లడం వివాదంగా మారింది. ఈ నెల 5న జరిగే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పెహోవా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జై భగవాన్ శర్మ ఇటీవల ఆ నియోజకవర్గంలో పర్యటించారు. వీర విధేయులైన కొందరు బీజేపీ కార్యకర్తలు భగవాన్ శర్మ పట్ల తమ విధేయతను చాటుకోవడానికి నేలపై మోకాళ్లపై కూర్చుని తమ రెండు చేతులను నేలపై ఉంచి, దానిపై నడిచి తమను ఆశీర్వదించాలని ఆయనను కోరారు. దీనికి భగవాన్ అభ్యంతరం చెప్పకుండా దర్జాగా వారి చేతులను తొక్కుకుంటూ నడిచారు. దీనిపై పలువురు నెటిజన్లు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

అమేఠీలో దళిత కుటుంబం కాల్చివేత

- పిల్లలనూ వదలని దుండగులు

అమేఠి: బీజేపీ పాలిత యూపీలో దళిత ఉపాధ్యాయుని కుటుంబంలోని నలుగురిని దుండగులు దారుణంగా కాల్చి చంపారు. మృతుల్లో టీచర్ సునీల్ (35), అతని భార్య పూనమ్, ఐదేండ్లు, 18 నెలల ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన అమేఠి జిల్లా అహూర్వ భర్వానిలో గురువారం సాయంత్రం జరిగింది. ఉపాధ్యాయుడు సునీల్ నివసిస్తున్న అద్దె ఇంట్లోకి నిందితుడు చందన్ వర్మ, కొందరు దుండగులు చొరబడి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చందన్ వర్మ అనే వ్యక్తి తమపై వేధింపులకు పాల్పడుతున్నాడని టీచర్ భార్య పూనమ్ భారతి ఆగస్టు 18న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

సీఎం కుర్చీ కోసం పైరవీలు

- కర్ణాటక కాంగ్రెస్‌లో జోరుగా నేతల ప్రయత్నాలు
- ముడా స్కామ్‌లో కూరుకుపోయిన సిద్ధరామయ్య
- పదవి నుంచి తప్పకోవాలని డిమాండ్లు

బెంగళూరు: ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయి విచారణను ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య ఏ క్షణంలోనైనా పదవిని కోల్పోతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. అదే సమయంలో ఆ పీఠాన్ని చేజిక్కించుకోవడానికి కొందరు నేతలు జోరుగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే ముడా కేసులో ఈడీ, లోకాయుక్త పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

జోరుగా నేతల మంతనాలు

ఎస్సీ వర్గానికి చెందిన సీనియర్ మంత్రులు పరమేశ్వర, మహదేవప్ప, ఎస్టీ వర్గానికి చెందిన సతీశ్ జార్కిహోళి ఇటీవల కలుసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకు ముందు డిప్యూటీ సీఎం శివకుమార్ కూడా పరమేశ్వర, జార్కిహోళితో విడివిడిగా సమావేశమై మంతనాలు జరిపారు. ఒక వేళ కాంగ్రెస్ అధిష్ఠానం కనుక సిద్ధరామయ్యను మార్చాలనుకుంటే పరమేశ్వర, శివకుమార్ ఆ పదవికి పోటీపడేవారిలో ముందువరుసలో ఉంటారని ఒక సీనియర్ నేత తెలిపారు. కాగా, ఇప్పటికే పార్టీలోని ఆర్‌వీ దేశ్‌పాండే, ఎంబీ పాటిల్ లాంటి నేతలు సిద్ధరామయ్యపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తూ తాము ఆ పదవికి పోటీలో ఉన్నామంటూ ప్రకటించారు. ప్రతి ఒక్కరూ సీఎం పదవిని కోరుకుంటారని, అందులో తప్పు లేదని, అధిష్ఠానం సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిని చేసింది కాబట్టి ఆయన ఆ పదవిలో ఉన్నారని పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం వీరప్ప మొయిలీ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన ఐదేండ్లు సీఎంగా కొనసాగుతారా అన్నది అధిష్ఠానం ఇష్టమని, సిద్ధరామయ్య దిగిపోవాలంటూ పార్టీ నుంచి ఎలాంటి ఒత్తడి లేదని ఆయన అన్నారు. కాగా, 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనే తాను సీఎం పదవికి పోటీ పడతానని జార్కిహోళి గతంలో ప్రకటించారు.

సిద్ధూకి అధిష్ఠానం అండదండలు

ముడా కుంభకోణంలో సిద్ధరామయ్య పీకల్లోతు కూరుకుపోయినా ఆయనకు అధిష్ఠానం అండగా ఉన్నదన్న ప్రచారం జరుగుతున్నది. తమను అధికారం లోంచి దించేయడానికే కేంద్రంలోని బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను, గవర్నర్ వ్యవస్థలను పావుగా వినియోగించుకుంటున్నదని, బీజేపీ ఎత్తులకు బ్రేక్ వేయాలంటే సిద్ధూనే సీఎంగా కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి.

పార్టీ పరువు పోతున్నా కొనసాగిస్తారా?

ముడా కుంభకోణంలో పూర్తి ఆధారాలతో సిద్ధరామయ్యపై ఆరోపణలు ఉన్నాయని, ఆయన అందులోంచి బయటపడటం దాదాపు అసాధ్యమని పార్టీలోని కొందరు నేతలు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిద్ధూనే సీఎంగా కొనసాగితే పార్టీ పరువు బజారున పడటం ఖాయమని, ఆయనను మార్చడం తప్ప పార్టీకి మరో ప్రత్యామ్నాయం లేదని వారు అంటున్నారు.

జర్నలిస్టులపై క్రిమినల్ కేసులొద్దు

ప్రభుత్వాన్ని విమర్శించినంత మాత్రాన కేసులు పెట్టరాదు

పాత్రికేయుల భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలి

యూపీ జర్నలిస్టు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: ప్రభుత్వాన్ని విమర్శించే వార్తలు రాశారనే కారణంతో జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయొద్దని సుప్రీంకోర్టు పేర్కొన్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) కింద జర్నలిస్టులకు ఉన్న భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని స్పష్టం చేసింది. యూపీ ప్రభుత్వ అధికారుల్లో కుల సమీకరణాలను ఉద్దేశించి జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ 'యాదవ్ రాజ్ వర్సెస్ ఠాకూర్ రాజ్' శీర్షికన ఒక కథనం రాశారు. దీనిపై లక్నోలోని హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో సెప్టెంబర్ 20న ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాల్సిందిగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీ ఎన్ భట్టీ విచారించారు.

యూపీ ప్రభుత్వానికి నోటీసులు

పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'కేవలం జర్నలిస్టు రాసినవి ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉన్నాయనే కారణంతో క్రిమినల్ కేసులు పెట్టొద్దు' అని కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాల్సిందిగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కేసును నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ఈ లోగా పిటిషనర్‌దారుపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కాగా, యూపీ పోలీసులు అధికారిక 'ఎక్స్' అకౌంట్ ద్వారా చట్టపరమైన చర్యలు ఉంటాయని పిటిషనర్‌ను హెచ్చరించారని, అతడిపై రాష్ట్రంలో ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయో కూడా తెలియని పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించినట్టు పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

'టాయ్‌లెట్ ట్యాక్స్'పై వెనక్కు

విమర్శలతో ఉత్తర్వులు రద్దు చేసిన హిమాచల్ కాంగ్రెస్ సర్కారు

సిమ్లా, అక్టోబర్ 4: 'టాయ్‌లెట్ ట్యాక్స్'పై హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో మరుగుదొడ్లపై రూ.25 చొప్పున పన్ను వసూలు చేయాలని ఇచ్చిన నోటిఫికేషన్‌ను శుక్రవారం ఉపసంహరించుకుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా అలవికాని హామీలు ఇచ్చి హిమాచల్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసింది. ఉద్యోగులకు సమయానికి వేతనాలు సైతం ఇవ్వలేకపోతున్నది. ఈ నేపథ్యంలో ప్రజలపైనే భారం వేసి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగానే విధించిన టాయ్‌లెట్ ట్యాక్స్‌పై రాష్ట్రంలోని ప్రతిపక్ష బీజేపీతో పాటు ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో సుఖ్విందర్ సింగ్ సుఖు సర్కారు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.

సచివాలయం నుంచి దూకేసిన డిప్యూటీ స్పీకర్, నేతలు

ముంబై, అక్టోబర్ 4: మహారాష్ట్ర డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ తన అనూహ్య చర్యతో అందరినీ షాక్‌నకు గురి చేశారు. మహారాష్ట్ర సచివాలయమైన మంత్రాలయ భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకారు. అయితే ఆయన రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన నెట్‌పైనే దూకడంతో ఎలాంటి గాయాలు కాలేదు. ధన్గర్ కులస్తులను ఎస్టీలో చేర్చడాన్ని నిరసిస్తూ జిర్వాల్, ఎన్సీపీ ఎమ్మెల్యే కిరణ్ లహమటే, బీజేపీ గిరిజన ఎంపీ హేమంత్ సవర శుక్రవారం భవనం పై నుంచి కిందకు దూకేశారు. అయితే ఆత్మహత్యల నివారణ కోసం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన వలలో వారు పడటంతో ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్సీ గోపీచంద్ పడల్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న జిర్వాల్ లాంటి వ్యక్తి ఇలాంటి దుందుడుకు నిరసనకు దిగాల్సిన అవసరం లేదని అన్నారు.

కోర్టును ధిక్కరించి కూల్చేస్తే..

పునరుద్ధరించాల్సిందే

బుల్డోజర్ కూల్చివేతలపై గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ: బుల్డోజర్ జస్టిస్‌కు వ్యతిరేకంగా ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి ఏమైనా నిర్మాణాలను కూల్చేస్తే, వాటిని పునరుద్ధరించాలని ఆదేశిస్తామని గుజరాత్ ప్రభుత్వ అధికారులను సుప్రీంకోర్టు శుక్రవారం హెచ్చరించింది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన అధికారులను జైలుకు కూడా పంపిస్తామని చెప్పింది. సుప్రీంకోర్టు గత నెల 17న ఇచ్చిన ఆదేశాల్లో, దేశవ్యాప్తంగా ఎటువంటి నిర్మాణాల కూల్చివేతలు జరగరాదని పేర్కొంది. కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి ఆస్తులను సైతం ధ్వంసం చేయరాదని స్పష్టం చేసింది. ఏమైనా నిర్మాణాలను కూల్చివేయాలంటే ముందుగా తన అనుమతి పొందాలని తెలిపింది. అయితే, రోడ్లు, జలాశయాలు, నదీపరీవాహక ప్రాంతాలు, పుట్‌పాత్‌లు వంటి బహిరంగ ప్రదేశాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చేయడానికి ఈ ఆదేశాలు వర్తించబోవని తెలిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, గత నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించలేదని చెప్పారు.

లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్

- ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకొనే ఏర్పాటు చేశాం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరగాలి
- సుప్రీంకోర్టు ద్వి సభ్య ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): తిరుమల లడ్డూ వివాదంపై ఐదుగురు సభ్యులతో స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ సిట్‌లో ఇద్దరు సీబీఐ, ఇద్దరు ఏపీ పోలీసు అధికారులు, ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఎఐ) నుంచి ఒకరు ఉండాలని సూచించింది. ఈ సిట్ పర్యవేక్షణ బాధ్యతలను సీబీఐ డైరెక్టర్‌కు అప్పగించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రద్దు అవుతుందని స్పష్టం చేసింది. తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని ఐదుగురు పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో సీనియర్ బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి, చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్‌సంపత్, ప్రవచన కర్త దుష్యంత్, సుదర్శన్ న్యూస్ టీవీ సంపాదకుడు సురేష్ ఖండేరావు, చౌహాన్‌కే, హిందూసేన అధ్యక్షుడు సూర్జిత్‌సింగ్ యాదవ్ ఉన్నారు. ఈ పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. లడ్డూ వివాదం రాజకీయ డ్రామాగా మారకూడదని స్పష్టంచేసింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని గుర్తు చేసింది.

స్వతంత్ర దర్యాప్తు చేయాల్సిందే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాదనలపై పిటిషనర్ల తరపు సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ అభ్యంతరం తెలిపారు. లడ్డూ వివాదానికి సంబంధించి గురువారం కూడా ఏపీ సీఎం చంద్రబాబు మరో ప్రకటన చేశారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ వాదనలపై ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకొనిఈ కేసుకు సంబంధించిన నివేదిక జూలైలో వచ్చిందని, రెండింటికీ సంబంధం లేదని అన్నారు.

రాష్ట్ర సిట్‌పై ఎలాంటి సందేహం లేదు: ఎస్జీ

తొలుత కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్(ఎస్జీ) తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. కావాలంటే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ఒకరిని సిట్‌లో చేర్చవచ్చు' అని కోర్టుకు నివేదించారు. దీనిపై రోహత్గీ జోక్యం చేసుకొని..'తాము సిట్‌తో విచారణ చేయించాలనుకుంటున్నాం. అందులో మీకు నచ్చిన అధికారిని చేర్చవచ్చు' అని తెలిపారు.

బాధ్యత మీదంటే మీదని వాదన

నెయ్యి ట్యాంకర్లు అసలు సరఫరాదారు నుండి సరఫరా కాలేదని టీటీడీ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. పందికొవ్వు ఉపయోగించినట్టు కచ్చితమైన రుజువు ఉందని రోహత్గీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వ్యాఖ్యలను కపిల్ సిబల్ ఖండించారు. ఈ ఆరోపణలను ఏ రిపోర్ట్ చెప్పిందని ప్రశ్నించారు. అందుకు రోహత్గీ నివేదిక చూపించగా.. దానికి కపిల్ సిబల్ జోక్యం చేసుకుని 'ఇది కూరగాయల కొవ్వు. జంతువుల కొవ్వు కాదు. అందుకే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి' అని డిమాండ్ చేశారు. లూథ్రా స్పందిస్తూ.. జూలై 4 వరకు వచ్చినవి పరీక్షించలేదని, కానీ జూలై 6, 12 తేదీల్లో చేరినవి కల్తీ అయ్యాయని అన్నారు. అయితే, కొండపైకి వెళ్లేందుకు ఎందుకు అనుమతించారని, మీరే బాధ్యత వహించాలని కపిల్ సిబల్ అన్నారు. టెండర్ ఇచ్చింది మీరే(గత ప్రభుత్వం)అని లూత్రా ఆరోపించారు.

కోర్టులను రాజకీయ యుద్ధ భూములుగా మారనివ్వం: ధర్మాసనం

''సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సీబీఐ నుంచి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఎఐ నుంచి ఒకరితో కూడిన స్వతంత్ర సిట్ దర్యాప్తు జరుగుతుంది' అని కోర్టు స్పష్టం చేసింది. కోర్టును రాజకీయ యుద్ధభూమిగా ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని పేర్కొన్నది. కోట్లాది మంది ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి స్వతంత్ర సిట్ దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేసింది.

నేడు హర్యానా అసెంబ్లీ ఎన్నికలు

హ్యాట్రిక్‌పై బీజేపీ కన్ను

బ్రేక్ వేయాలని కాంగ్రెస్ యత్నం

చండీగఢ్, అక్టోబర్ 4: 90 శాసన సభ స్థానాలున్న హర్యానా అసెంబ్లీకి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,031 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. చాలా స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. హ్యాట్రిక్ విజయంపై బీజేపీ కన్నేయగా, దశాబ్దం తర్వాత అధికారాన్ని చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఆప్, ఐఎన్ఎల్డీ–బీఎస్పీ, జేజేపీ–అజాద్ సమాజ్ పార్టీ తమ సత్తా చాటాలని చూస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీకిరెబెల్స్ బెడద కూడా ఉంది. సీఎం నాయబ్ సింగ్ సైనీ, శాసనసభలో విపక్ష నేత భూపిందర్ సింగ్ హూడా, అభయ్ సింగ్ చౌతాలా, మాజీ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగాట్, తదితర ప్రముఖులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఓట్ల లెక్కింపు ఈ నెల 8న జరగనుంది.

'వయసును తగ్గించే టైమ్ మెషీన్' అంటూ టోకరా

35 కోట్లకు వృద్ధులను మోసగించిన దంపతులు

కాన్పూరు: అరవయ్యేళ్ల వృద్ధులను పాతికేళ్ల యువకులుగా మార్చుతామంటూ ఇద్దరు దంపతులు భారీ మోసానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజీవ్ కుమార్ దూబే, ఆయన భార్య రష్మి కలిసి రివైవల్ వరల్డ్ అనే థెరపీ సెంటర్‌ను ప్రారంభించారు. తాము ఇజ్రాయెల్‌లో తయారైన ఓ టైమ్ మెషీన్‌ను తీసుకొచ్చామని, దాని ద్వారా వృద్ధులను తిరిగి యువకులుగా మార్చుతామని ప్రచారం చేశారు. దీని కోసం ఆక్సిజన్ థెరపీకి 10 సెషన్లకు రూ.6,000; మూడేళ్ల పాటు చికిత్సకు రూ.90,000 చెల్లించాలని చెప్పారు. వీరి మోసానికి గురైన బాధితురాలు రేణు సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన వద్ద రూ.10.75 లక్షలు తీసుకున్నారని, తనను మోసం చేశారని ఆరోపించారు. చాలా మందిని ఇలా మోసం చేసి, సుమారు రూ.35 కోట్లు దండుకున్నారని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించడంతో ఈ దంపతులిద్దరూ విదేశాలకు పారిపోయినట్లు అనుమానిస్తున్నారు.

శక్తి కోసం ఐవీఎన్ థెరపీ

అలసట తగ్గేందుకు సెలైన్లను ఆశ్రయిస్తున్న ద.కొరియా, చైనా ఉద్యోగులు

సియోల్, అక్టోబర్ 4: దక్షిణ కొరియా, చైనాలో ఉద్యోగులు తమ అలసటను తగ్గించుకునేందుకు, కొత్త శక్తిని పొందేందుకు విరివిగా ఇంట్రావీనస్ డ్రిప్స్‌ను (సెలైన్లను) ఉపయోగిస్తున్నట్టు 'ఎంవై న్యూస్' వెల్లడించింది. ఇంట్రావీనస్ న్యూట్రియెంట్ థెరపీ (ఐవీఎన్‌టీ)గా పిలిచే ఈ ప్రక్రియలో